Sinfi Tafriq Aur Islam
(Telugu)

లింగ వివక్ష

మూలం

ఫజ్లుర్రహ్మాన్ ఫరీది

అనువాదం

అబుల్ ఇర్ఫాన్

అనంతకరుణామయుడు అపారకృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

లింగ వివక్ష

పాశ్చాత్యనాగరికత మానవుల్ని వివిధ వర్గాలలో విభజించేందుకు ఎల్లప్పుడూ ఆలోచిస్తుంది. అది ప్రజలను జాతి, తెగ, కులం, వర్ణం, లింగం, ప్రాంతం, భాషల ప్రాతిపదికలపై విభజిస్తుంది. ఈ ప్రాతిపదికల ప్రకారమే ప్రజల విధులు, హక్కులను కూడా నిర్దేశిస్తుంది. ప్రకృతికి వ్యతిరేకమైన ఈ కృత్రిమ విభజన సామాజిక వ్యవస్థలో పరస్పర విరుద్ధమైన రెండు లక్ష్యాలను సాధించడానికి రూపొందించిన పథకం. ఒకవైపు ఈ వివక్ష, విచక్షణలను పటిష్ఠ పరుస్తూ మరోవైపు వాటి వల్ల ఏర్పడే దుష్ఫలితాలను అరికట్టడానికి విధులు-హక్కుల పోరాటం రేకెత్తించింది. ఇలా పాశ్చాత్య నాగరికత మానవ సమాజాన్ని వివిధ వర్గాలుగా చేసి వారిని తమ హక్కుల కోసం పోరాడే రణరంగంగా మార్చివేసింది.

ఈ విభజన చదరంగంలోని అనేక పావులలో నేడు 'లింగ వివక్ష' (Gender Disparity) చురుకైన పావుగా ఆడబడుతోంది. ఈ లింగ వివక్ష అనే పేరు ద్వారానే హక్కులరీత్యా ఈనాడు స్త్రీలకు చాలా అన్యాయం జరుగుతోందన్న భావన సృష్టించ బడింది. ఈ అన్యాయాన్ని అరికట్టడానికి పాశ్చాత్య నాగరికతకు పోరాటం రేకెత్తించడం అనివార్యమైపోయింది. సమాజంలోని వివిధ శక్తులను హక్కుల సాధన కోసం నిరంతర పోరాటంలో చిక్కుకొని ఉండేలా చేయడమే నేటి పాశ్చాత్య నాగరికత ప్రధానాశయం. ఈ ఆశయ సాధనలో హక్కుల నిర్ణయమే మొట్టమొదటి అంశం. హక్కుల పోరాటంలో ఎన్నో ముఖ్యమైన కొన్ని సూత్రాలను ఉద్దేశ్యపూర్వకంగా

విస్మరించడం జరుగుతోంది. మొదటి సూత్రం, హక్కుల విభజన ప్రతి వర్గంలోని సహజ సిద్ధమైన శక్తిసామర్థ్యాల ఆధారంగా జరగాలి. స్త్రీ పురుషుల్లోని సహజ సిద్ధమైన శక్తిసామర్థ్యాలలో ఎలాంటి మౌలిక మార్పులు జరగకూడదు. రెండవ సూత్రం, హక్కులు, విధులు ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నప్పుడే అవి సక్రమంగా నెరవేరుతాయి. ఒకవేళ హక్కుల్ని మాత్రమే తీసుకొని సమాజాన్ని పునర్వ్యవస్థీకరిస్తే అది తన లక్ష్యాలను పూర్తిగా సాధించ లేదు. అలాగే కేవలం విధులు, బాధ్యతల ప్రాదిపదికపై సమాజాన్ని పునర్వ్యవస్థీకరించడం జరిగితే అది దౌర్జన్యం, దోపిడీలకు జన్మనిస్తుంది.

హక్కుల్ని గురించి మాత్రమే పోరాడితే ఆ పోరాటం విశృంఖల స్వేచ్ఛకు తలుపు తెరచి మనిషిని బాధ్యతల నుండి పారిపోయేలా చేస్తుంది; మానవులు పరస్పరం కలసి మెలసి ఉండేలా శిక్షణ ఇచ్చే సూత్రాలు, నిబంధనలు, విలువలను కాలరాస్తుంది. యావత్తు సమాజం వ్యక్తిగత, సామూహిక బాధ్యతారాహిత్యానికి గురయి పోతుంది.

స్త్రీపురుషుల మధ్య ప్రకృతి విరుద్ధమైన అసమానత్వాన్ని వ్యతిరేకించే సహజసిద్ధమైన జీవన వ్యవస్థ ఇస్లాం. దీని ప్రకారం మానవులంతా దేవుని దృష్టిలో సమానులే. అందరూ గౌరవించదగినవాళ్ళే. దేవుడు ప్రపంచంలో సృష్టించిన భాగ్యాలను అనుభవించే హక్కు అందరికీ ఉంది. దివ్యఖుర్ఆన్ మానవ సమానత్వాన్ని గురించి ఈవిధంగా ప్రస్ఫుటం చేస్తోంది:

"అల్లాహ్‌యే మిమ్మల్ని ఏకైక ప్రాణి నుండి సృష్టించాడు.
ఇంకా అదే జాతి నుండి అతని సహచరిని సృజించాడు."

(ఖుర్ఆన్-7:189)

ఈ హితవులో దేవుడు స్త్రీ, పురుషుల జంటను ఒకే జీవం నుండి సృష్టించాడని పేర్కొన్నాడు. అంటే స్త్రీ, పురుషు లిరువురి సృష్టికీ మూల

పదార్థం ఒక్కటే అన్న మాట. అలాగే మానవ జన్మ గురించి ఖుర్‌ఆన్ మరొక చోట ఇలా పేర్కొన్నది:

"తరువాత అతడు ఒక నెత్తుటి ముద్దగా మారాడు; ఆ తరువాత అల్లాహ్ అతని శరీరాన్ని తయారు చేశాడు; ఆపై అతని అవయవాలను రూపొందించాడు. అటుపై దాని నుండి స్త్రీపురుషుల రెండు రకాల (జాతుల)ను సృష్టించాడు." (75: 38,39)

ఇస్లామీయ జీవిత భావన ప్రకారం ఒకే జీవం నుండి ఉనికిలోకి వచ్చిన స్త్రీ, పురుష లిరువురి పుట్టుక వెనుక ఒకే సృష్టికర్త యుక్తి వివేకాలు ఉన్నాయి. అందువల్ల వారి మధ్య ఎలాంటి అసమానత్వం కలిగించినా అది సృష్టికర్త యుక్తికి వ్యతిరేకం, ప్రకృతివిరుద్ధమైన చర్య అవుతుంది. కనుక పురుషుడ్ని అధికుడిగా, స్త్రీని అధమురాలిగా పరిగణించడం జరిగితే అది సృష్టి నిర్వహణ పనిని బలహీన పరుస్తుంది. దురదృష్ట వశాత్తు ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం అనేక జీవిత భావనలు ఇలాంటి తప్పే చేశాయి. కొందరు స్త్రీని బుద్ధిమాందిత అన్నారు. కొందరు ఆమెను పురుషుని కోరికలు తీర్చే విలాసవస్తువుగా భావించారు. మరికొందరు ఆమెను పాపాలపుట్టగా పరిగణించారు. కొన్ని మతాలు ఆత్మవికాసం కోసం చేసే సాధనలో స్త్రీని పూర్తిగా పరిత్యజించాలని శాసించాయి. పకృతి విరుద్ధమైన ఈ లింగ విభజన ప్రభావం స్త్రీపురుషుల హక్కులకు హద్దులేర్పరచే పనిపై పడింది. తత్ఫలితంగా అనేక మంది స్త్రీ హక్కులను పూర్తిగా విస్మరించి ఆమె విధులు, బాధ్యతల మీదనే తమ శక్తిసామర్థ్యాలన్నీ ఎక్కుపెట్టారు.

ఇస్లాం స్త్రీపురుషుల దాంపత్య జీవితంలో హక్కులతో పాటు బాధ్యతలక్కూడా సమాన ప్రాముఖ్యం ఇచ్చింది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి చూడండి:

"మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి."

(2: 228)

బలవంతుడిదే రాజ్యమన్నట్లు సాధారణంగా పురుషుడు తన శక్తి, ఆధిక్యతలతో స్త్రీ హక్కులను కాలరాస్తూ ఆమెను కేవలం తన సేవకురాలిగా, చరణదాసిగా చేసుకుంటున్నాడు. ఇలా పురుషుడు స్త్రీ చేత వెట్టిచాకిరి చేయించుకోవడం తన హక్కుగా భావిస్తున్నాడు. ఇస్లాం ఈ ఆలోచనా ధోరణిని ఖండిస్తూ పురుషుడు తన హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదని, హక్కులు తనకే కాదు, స్త్రీకి కూడా ఉన్నాయని చెబుతోంది. ఇది పూర్వకాలంలో సాగిన ఒక విధమైన అతివాద వైఖరి. నేటి ఆధునిక కాలంలో దానికి పూర్తి విరుద్ధంగా మరొక అతివాద ధోరణి పుట్టుకొచ్చింది. ఇప్పుడు స్త్రీ స్వేచ్ఛ, హక్కులను గురించి ప్రతి చోటా చెవులు చిల్లులు పడే సమరశంఖారావం వినిపిస్తోంది. ఈ శంఖారావం గురించి, దాని వల్ల సమాజానికి ఎదురవుతున్న చిక్కులు, ఇబ్బందులను గురించి తరువాత పేజీలలో చెప్పడమయింది.

ఇక్కడ స్త్రీ అస్తిత్వం, దాని ఉద్దేశ్యం గురించి ఖుర్‌ఆన్ మరో ముఖ్యమైన విషయం ఈవిధంగా తెలియజేస్తోంది:

"ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలోనుండే సృష్టించాడు- మీరు వారి వద్ద శాంతిని పొందడానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి."

(దివ్యఖుర్‌ఆన్-30:21)

ఈ హితవులో దేవుడు మానవుల జాతి నుండే వారి జంటలను సృష్టించాడని పేర్కొంటూ లింగ వివక్షను ఖండించడం జరిగింది. కనుక

లింగ పరంగా మానవతను విభజించి ఒకరిని అధికులుగా, మరొకరిని అధములుగా పరిగణించడానికి వీల్లేదు. అంతేకాదు, ఈ సూక్తిలో స్త్రీ పురుషులను జంటగా రూపొందించడానికి కారణం కూడా పేర్కొనబడింది. ఈ జంట లక్ష్యం కేవలం కాల వాంఛలను తీర్చుకోవడమే కాదు, తద్వారా వారిద్దరిలో పరస్పరం ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు కూడా జనించాలి. ఈ ప్రేమాభిమానాలు, దయాదాక్షిణ్యాల కోసం వారిద్దరిని దేవుడు ఒకరిపై ఒకరు ఆధారపడేలా చేశాడు. అదీగాక ఆయన ఈ జంటను మానవ సమాజ వికాస సాధనంగా కూడా చేశాడు. లింగ వివక్ష భావనను నిర్మూలించడానికి ఇస్లాం అనేక చర్యలను తీసుకుంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ హితవులను గమనించండి:

> "రుజుమార్గాన్ని అవలంబించేవాని రుజువర్తనం స్వయంగా వానికే ప్రయోజనకరం. మార్గం తప్పినవాడు తన మార్గ భ్రష్టత్వం యొక్క దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. బరువు మోసే వాడెవడూ ఇతరుల బరువును మోయడు." (17:15)
>
> "పురుషులైనా స్త్రీలైనా- వారు గనక విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు." (4:124)
>
> "మీలోని ఎవరి శ్రమనూ నేను వృధాగా పోనివ్వను. పురుషుడైనా స్త్రీఅయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు." (3:195)

పై హితవులలో స్త్రీ, పురుషులిద్దరూ ఒకే జాతికి చెందినవారయినందున, ఇద్దరూ విశ్వాసులయినందునవారు చేసే సత్కార్యాల పుణ్యఫలం కూడా సమానంగా ఉంటుందని వివరించబడింది. స్త్రీపురుషులు ఇద్దరు విశ్వాసులుగా తమ తమ విధ్యుక్త బాధ్యతలను నిర్వహించడంలో ఒకరి

కొకరు సహకారులు. ఏ స్త్రీ కూడా తన బాధ్యతల్ని సరిగా నిర్వహించకుండా, తాను తన జీవిత భాగస్వామి అయిన భర్త అధీనంలో ఉన్నందున తానేమీ చేయలేనని సాకులు చెప్పడం సమంజసం కాదు. ప్రజలలో మంచిని వ్యాపింప జేసే, చెడులను అరికట్టే బాధ్యత ఇద్దరి మీదా సమానంగా ఉంది.

"విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని అజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు."
(ఖుర్ఆన్-9:71)

ఖుర్ఆన్‌లోని మరొక హితవులో ఈ విషయాన్నే మరింత విశదీ కరిస్తూ సత్కర్మల ఆచరణ కోసం సమానంగా కృషి చేసే స్త్రీ పురుషులు దైవమార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేస్తారని, అందువల్ల వారికి అపార పుణ్యఫలం లభిస్తుందని పేర్కొనబడింది.

"స్త్రీపురుషులలో దానధర్మాలు (సదఖా) చేసి అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవారికి, ఎన్నో రెట్లు పెంచి దానిని తిరిగి ఇవ్వడం జరుగుతుంది; వారికి ఎంతో మంచి ప్రతిఫలం లభిస్తుంది." (ఖుర్ఆన్-57:18)

మరికొన్ని హితవులలో సదాచరణ విషయమయి ఇంతకంటే వివరంగా పేర్కొంటూ విశ్వాసులయిన స్త్రీ పురులిద్దరూ సమానులని, లింగపరంగా ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే ప్రసక్తి లేదని తెలియజేయ బడింది.

"నిశ్చయంగా ముస్లిములూ, విశ్వాసులూ, విధేయులూ, నిజాయితీ పరులూ, సహనశీలురూ, అల్లాహ్ ముందు

వినమ్రులయ్యే వారూ, దానధర్మాలు చేసేవారూ, ఉప వాసం ఉండేవారూ, తమ మర్మాంగాలను కాపాడుకునే వారూ, అల్లాహ్‌ను అ్యధికంగా స్మరించేవారూ అయిన స్త్రీపురుషుల నిమిత్తం అల్లాహ్ క్షమాభిక్షను, గొప్ప ప్రతి ఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు." (ఖుర్ఆన్-33:35)

"విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారంతా దరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజు స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్ పట్ల అయన ప్రవక్త పట్ల విధేయత పాటిస్తారు. వారి మీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అందరికంటే ప్రబలుడు, వివేక వంతుడూ, వివేచనాపరుడూను." (ఖుర్ఆన్-9:71)

"విశ్వాసులైన ఈ పురుషులకూ, స్త్రీలకూ అల్లాహ్ వాగ్దానం చేశాడు, క్రింద కాల్వలు ప్రవహించే తోటలను వారికి ఇస్తానుఅని. వారు వాటిలో శాశ్వతంగా ఉంటారు. నిత్యము కళకళలాడే ఆ ఉద్యానవనాలలో వారికొరకు పరిశుద్ధమైన నివాసాలుంటాయి. ఇంకా అన్నింటికంటే మించిన అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. అదే గొప్ప సాఫల్యం." (ఖుర్ఆన్-9: 72)

ఖుర్ఆన్‌లోని ఈ హితవులను బట్టి ఇస్లాం స్త్రీకి ఎంతటి విలువ, గౌరవం ప్రసాదించిందో స్పష్టంగా తెలుస్తోంది. ఖుర్ఆన్‌లోనే కాదు, మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రవచనాలలో కూడా మనకు ఎన్నో

విషయాలు తెలియజేయబడ్డాయి. ఉదాహరణకు ఆయన ప్రవచించిన ఈ క్రింది హితోక్తులు చూడండి:

"స్వర్గం తల్లి పాదాల క్రింద ఉంది."

"మీ సత్ప్రవర్తనకు మొట్టమొదటి అర్హులు మీ తల్లులే."

ఇస్లాంలోని అతి ముఖ్యమైన ఆరాధనలలో హజ్ (కాబాయాత్ర) కూడా ఉందని అందరికీ తెలుసు. అలాంటి ఆరాధనలోని ప్రధాన సంప్రదాయాలలో సఫా, మర్వా కొండల మధ్య చేసే "సయీ" (ప్రశాంతంగా పరుగిడడం) ఒకటుంది. ఈ సంప్రదాయాన్ని పాటించకపోతే హజ్ విధి నెరవేరదు. 'సయీ' సంప్రదాయానికి ఇంతటి ప్రాముఖ్యం లభించడానికి కారణం స్త్రీయే. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) సతీమణి హజ్రత్ హాజరా (రజి) సఫ్వా మరియు మర్వా పర్వతాల మధ్య చేసిన 'సయీ'కు గుర్తింపుగా దేవుడు ఆ పనిని హజ్ ఆచారాలలో ఒక తప్పనిసరి ఆచారంగా, సంప్రదాయంగా చేశాడు.

ఇన్ని సాక్ష్యాధారాల సమక్షంలో ఇస్లాం స్త్రీని కించపరచిందని, ఇస్లామీయ సమాజంలో స్త్రీ వివక్షకు గురయిందని, ఆమె హక్కులను కాలరాయడం జరుగు తోందని, ఆమెకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, బురఖా వేసి బయటికి కదలకుండా గృహనిర్బంధం చేశారని, భర్త తలాఖ్ తలాఖ్ అని రెండు మూడు మాటలు ఉచ్చరించి భార్యను ఇంటి నుంచి వెళ్ళగొడ్తున్నాడని ఎవరైనా చెప్పవచ్చా?

దీనికి భిన్నంగా పాశ్చాత్య తరహా ఆధునిక నాగరికత స్త్రీకి ఇచ్చిన స్థానం ఏమిటో ఆలోంచించాలి. ఆధునిక నాగరికతను, ఇస్లామీయ నాగరికతతో పోల్చి విషయాన్ని విశ్లేషించడానికి ముందుగా ఆడపిల్లల పట్ల మనం ప్రవర్తించే తీరును తీసుకుందాం. ఆడపిల్లల పట్ల ఆధునిక

నాగరికత ప్రవర్తన ఏమిటో, ఇస్లామీయ నాగరికత ప్రవర్తన ఎలాంటిదో తెలుసుకోవాలి. ఇక్కడ మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించిన కొన్ని ఆదేశాలను చూడండి. ఆయన ఇలా బోధించారు:

"ఒక వ్యక్తికి ఓ కుమార్తె ఉండి, అతనా బాలికను సజీవసమాధి చేయకుండా, ఎలాంటి బాధలకు గురిచేయకుండా, ఆమె కంటే కొడుక్కు ఎక్కువ ప్రాధాన్యమివ్వకుండా పోషిస్తే ఆ వ్యక్తికి దేవుడు స్వర్గ ప్రవేశాన్నిస్తాడు." (అబూదావూద్)

"ఆడపిల్లల (సంరక్షణ బాధ్యత) ద్వారా పరీక్షకు గురిచేయబడిన ఏ మనిషయినా వారి పట్ల మంచిగా ప్రవర్తిస్తే ఆ బాలికలు అతని కోసం నరకాన్నుండి సురక్షితం చేయు అడ్డుగోడలుగా తయారవుతారు."

(ముత్తఫఖున్అలై)

"(విడాకులివ్వబడటం వల్లగాని, లేదా వితంతువయినందు వల్లగాని) నీ దగ్గరకు తిప్పిపంపబడిన నీ కుమార్తెకు నువ్వు తప్ప మరెవరూ సంపాదించిపెట్టేవారు లేనప్పుడు నువ్వామెకు మేలు చేయాలి."

(ఇబ్నెమాజ)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) "ముగ్గురు కుమార్తెలు లేక ముగ్గురు చెల్లెళ్ళు పెరిగి పెద్ద వారయి ఎవరిమీదా ఆధారపడకుండా ఉండే స్థితికి చేరుకునే వరకూ వారిని పోషించి, విద్యాబుద్ధులు నేర్పి, వారిపట్ల ప్రేమ, వాత్సల్యభావంతో ప్రవర్తించిన వ్యక్తికి దేవుడు తప్పనిసరిగా స్వర్గప్రాప్తి కలిగిస్తాడు."

అప్పుడు ఒకతను "దైవప్రవక్తా! మరి ఇద్దరు ఉంటేనో?" అని అడిగాడు. దానికి ఆయన "అప్పుడు కూడా" అన్నారు. జనం అప్పుడు ఒక్క ఆడపిల్లను గురించి అడిగినా దైవప్రవక్త (సల్లం) అదే సమాధాన

మిచ్చేవారని ఈ హదీసు ఉల్లేఖకుడు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ అన్నారు.
(షరహ్‌సున్న, తిర్మిజి, అబూదావూద్)

ఇస్లాం ఈ హితవుల్ని 1400 సంవత్సరాల క్రితం ఆడపిల్ల పుట్టుకను అవమానకరమైన విషయంగా భావించబడుతుండిన ప్రాచీన అజ్ఞాన యుగంలోనే లోకానికి అందజేసింది. ఆనాడే, అలాంటి సమాజంలోనే ఈ సువర్ణ హితవులు, ఆదేశాలు వెలువడ్డాయి అంటే ఇప్పుడు వాటి ప్రాముఖ్యం అనేక రెట్లు హెచ్చయింది.

ఈనాటికీ మన దేశంలో కూడా కొన్ని చోట్ల ఆడపిల్లలను పుట్ట గానే హతమార్చే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ దురాచారంలో ధనికులు, పేదలు అన్న తేడా లేకుండా అందరి పాత్రా ఒకటే. లింగ వివక్షకు సంబంధించిన ఈ విషక్రిములు ఆడపిల్ల జన్మ నుండే పుట్టుకు వస్తున్నాయి, సమాజంలో అవి పెంచబడి పోషించబడుచున్నాయి.

ఇస్లాం కేవలం సూత్రాలు, విలువలు పేర్కొనడంతోనే తృప్తి చెంద లేదు. ఇది వివరమైన శాసనాలు కూడా రూపొందించింది. ఈ శాసనాల ద్వారా ఒక న్యాయపరమైన సమాజానికి కావలసిన రూపురేఖలు కూడా ఇస్తూంది. స్త్రీపురుషులిద్దరి హక్కులు, బాధ్యతలు కూడా తెలియజేసింది. న్యాయవంతమైన ఈ శాసనాలను గురించి ఇక్కడ సంక్షిప్తంగానైనా తెలుసుకుందాం. ఇవి దాంపత్య జీవితపు సమానత నుంచి ప్రారంభమవు తాయి. ఇస్లాం వివాహం కోసం ఉభయ పక్షాలకు సమాన హక్కులు ప్రసాదించింది. అంగీకరించే, తిరస్కరించే అధికారం ఇద్దరికీ ఇచ్చింది. విడాకుల హక్కు ఇద్దరికీ ఉంది. ఇస్లాంలో పురుషుడు ఇచ్చే విడాకుల్ని 'తలాఖ్' అంటారు. స్త్రీ ఇచ్చే విడాకుల్ని 'ఖులా' అంటారు. కాకపోతే కొన్ని షరతులో ఖులా అధికారం పరిమితం చేయబడింది, దానికి బలమైన కారణాలు కూడా పేర్కొనబడ్డాయి. అదే విధంగా వారసత్వపు ఆస్తి పంపిణీ విషయంలో కూడా న్యాయం చేకూర్చే చట్టాలు ఉన్నాయి.

ఇస్లాం ఈ చట్టాల ద్వారా స్త్రీపురుషులిద్దరి బాధ్యతలు ఏమిటో తెలియ జేసింది. శిక్షా, ప్రతిఫలం విషయంలో సమానతను పాటించింది. ఎవరైనా సరే నేరం చేస్తే శిక్షకు, సత్కార్యం చేస్తే ప్రతిఫలానికి అర్హుడవు తాడు. దీనికి భిన్నంగా ఆధునిక నాగరికతలో స్త్రీ, పురుషుల్ని వేర్వేరు జాతులుగా విభజించి ఆ ఉభయుల్లో ఒకరి హక్కుల్ని నిర్ణయించి వాటికోసం పోరాడుతూ అడుగడుగునా ఎదురుదెబ్బలు తింటూంది సమాజం.

ఈ ఎదురు దెబ్బలకు అనేక సాక్ష్యాధారాలు ఉన్నాయి. ప్రాచీన సభ్యతా సంస్కృతుల్ని తుడిచిపెట్టే ప్రయత్నంలో ఆధునిక సంస్కృతి అత్యుత్సాహంతో ముందుగా 'స్త్రీ స్వాతంత్రోద్యం' (Women's Liberation) నడిపింది. హక్కుల రీత్యా స్త్రీపురుషులు ఇరువురినీ సమానంగా పరిగణించింది. ఈ ఉద్యమ లక్ష్యం స్త్రీలకు హక్కులను ఇప్పించడం మాత్రమే కాదు, దాని వెనుక పురుషుల హక్కులను తగ్గించడం కూడా ఉంది. అంటే పురుషుల నుండి వారి హక్కులను లాక్కొని స్త్రీలకు ఇప్పించడం అన్న మాట. దాని కోసం జీవితంలోని ప్రతి రంగంలో, ప్రతి ఘట్టంలో పోరాటం మొదలయింది. ఈ ఉద్యమ రెండవ లక్ష్యం స్త్రీల హక్కుల పరిధిని సమస్త రంగాల్లో క్రమంగా విస్త రింపజేయడం. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఉపాధి మొదలైన సమస్త రంగాల్లో పురుషులకు ఎలాంటి హక్కులు ఉన్నాయో స్త్రీలకూ అలాంటి హక్కులు లభించాలన్నదే దాని రెండవ లక్ష్యం. ఈ హక్కుల పోరాటంలో నిమగ్నులయిన ఉద్యమకారులకు కుటుంబ జీవితానికి సంబంధించిన బాధ్యతల భారం దుర్భరం అన్పించసాగాయి. చివరికి పిల్లల విద్యా శిక్షణలు కూడా మోయలేని భారమైపోయి వాటి బాధ్యతను ఇప్పుడు వ్యక్తుల నుండి తీసేసి సామూహికతకు ఇవ్వడానికి

రంగం సిద్ధమవుతోంది. దాని కోసం రకరకాల పథకాలు, ప్రతిపాదనలు తయారవుతున్నాయి. ఉదాహరణకు- ప్రసవ భారాన్ని స్త్రీ పురుషులిద్దరూ భరించాలని, పురుషుడు కూడా (లింగమార్పిడి చేసుకొని) ప్రసవవేదనలో పాల్గొనాలని, దాని కోసం అవయాల్లో, దేహనిర్మాణం (Anotomy)లో తగిన మార్పులు తీసుకురావాలని కొందరు ప్రతిపాదించారు.

అయితే హక్కుల పోరాటంలో అనేక శతాబ్దాల నుండి వస్తున్న కుటుంబ వ్యవస్థకు ఎంత నష్టం వాటిల్లుతుందో మరచిపోతున్నారు ప్రజలు. స్త్రీ పురుషులు ఇద్దరూ కలసి కుటుంబ వ్యవస్థను సక్రమంగా నిర్వహించకపోతే వారిద్దరి మధ్య ప్రేమాభిమానాలు, దయాదాక్షిణ్యాల వాతావరణం ఏర్పడక పోవడమే గాకుండా, సంతాన శిక్షణ కూడా సాధ్యం కాదు. ఈ చేదు ఫలాలు ఆధునిక నాగరికతా ధ్వజ వాహకుల ముందుకు కూడా వచ్చాయి. సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిపోతోందని, సంప్రదాయాల పట్ల గౌరవం క్షీణిస్తోందని, ఫలితంగా సంతానం తమ తల్లిదండ్రుల్ని గౌరవించడం లేదని, తల్లిదండ్రులక్కూడా తమ సంతానం పట్ల మమతామమకారాలు తగ్గిపోతున్నాయని వారు తెలుసుకున్నారు. తల్లికి తన అందం, ఆరోగ్యం పట్ల విపరీత మైన ఆసక్తి పెరిగిపోవడంతో ఆమె తన చంటిపిల్లవాడికి స్తన్యం ఇవ్వడానికి బదులు డబ్బా పాలిచ్చి తృప్తి పడుతోంది. అయితే డాక్టర్ల ఆందోళన, నిరశనలతో జనం తిరిగి తల్లిపాల వైపు దృష్టి కేంద్రీకరించ సాగారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై పోయి కుటుంబసభ్యుల మధ్య ప్రేమాభిమానలు, దయాదాక్షిణ్యాలు కొరవడి పోయినందున ముసలి తల్లిదండ్రుల్ని వృద్ధాప్యం కారణంతో ఇంటి నుంచి తీసేసి వృద్ధాప్య గృహాల (Old age Homes)కు తరలిస్తు న్నారు. ఈ విషయాన్ని బట్టే స్త్రీహక్కుల ఉద్యమం సమాజాన్ని ఎటువైపు తీసికెళ్తుందో ఊహించవచ్చు.

నేటి స్త్రీహక్కుల ఉద్యమం స్త్రీ మనస్తత్వాన్ని పూర్తిగా మార్చి వేసింది. ఈ ఉద్యమం దృష్టిలో స్త్రీ వ్యవహారం లైంగిక విషయానికి సంబంధించిన విషయం మాత్రమే. దాని ప్రకారం ఆమెతో లైంగిక సంబంధం కలిగి ఉండటంతోనే స్త్రీపురుషుల మధ్య పరస్పర సంబంధాలు ప్రారంభమవుతాయి. ఆమె అందచందాలే అసలైన సూదంటు రాయి. ఈ దృక్పథం కారణంగా కృత్రిమ అలంకరణ సామగ్రితో దుకాణాలు నిండిపోయాయి. కుటుంబ జీవితానికి సంబంధించిన బడ్జెట్ సమతూకం కోల్పోవనారంభించింది. స్త్రీకి తన అందం కాపాడుకోవడానకి, తన సహజ సౌందర్య వాంఛను నెరవేర్చు కోవడానికి చేయబడుతున్న డిమాండు మార్కెట్పై చూపవలసిన తన ప్రభావాన్నంత చూపింది. చివరికి స్త్రీ అందచందాలు కూడా లైంగిక దుకాణాలయి పోయాయి. ఇప్పుడు ఎవరైనా ఎదైనా కంపెనీ లేదా దుకాణం నడపదలచుకుంటే వాటి ఉత్పతులు, వస్తువుల మార్కెటింగ్ కోసం స్త్రీ సౌందర్యాన్ని ప్రదర్శించడం తప్పనిసరి అయిపోయింది. ఈ విధంగా స్త్రీని మాన మర్యాదల స్థానం నుండి అగౌరవం, అవమానాల స్థాయికి దిగజార్చడమే ఆధునిక నాగరికత సాధిస్తున్న ఘన కార్యం. ఒకవేళ మనం స్త్రీ అందాన్ని బజారులో బహిర్గతంకాకుండా ఎవైనా జాగ్రత్తలు తీసుకుంటే స్త్రీని ఒంటింటి కుందేలుగా చేశారు; ఆమెకు స్వేచ్ఛ లేకుండా ఇంట్లో నిర్బంధించారు అంటూ మనపై విమర్శల వడగండ్లు విరుచుకుపడతాయి. కారణం స్త్రీ సౌందర్య ప్రదర్శన లేకుండా ఈనాడు ఏ వస్తువూ అమ్ముడు పోవడం లేదు. వస్త్రాలు, వాహనాలు, సంగీత పరికరాలు- చివరికి పిల్లల ఆటవస్తువులు, పాల డబ్బాలు ఇంకా మత్తుపదార్థాలు సైతం స్త్రీ సౌందర్య ప్రదర్శన లేనిదే అమ్ముడు పోవడం లేదు. అసలీ సౌందర్య ప్రదర్శనే స్త్రీ ఔన్నత్యాన్ని, ఆమె గౌరవమర్యాదలను ఇనుమడిస్తున్నాయని ఆధునిక నాగరికతా ధ్వజవాహకులు ఢంగా వాయించి చెబుతున్నారు.

ఈ ఆలోచనా ధోరణి, దృక్పథాలతో స్త్రీ పురుషుల సహజత్వమే మారిపోయింది. లజ్జ, లాలిత్యం, దయార్ద్రత, కోమలత్వాలు మూర్తీభవించిన అలనాటి స్త్రీలేనా వీరు అని ప్రశ్నించుకోవలసి వస్తుంది ఒక్కోసారి. ఇప్పుడు కొందరు స్త్రీలయితే ఎక్కడైనా తమకు తమ అందచందాలను నగ్నావతారంలోనైనా సరే ప్రదర్శించుకునే, తద్వారా డబ్బు సంపాదించుకునే హక్కుందని బల్లగుద్ది మరీ చెబుతున్నారు. కాదంటే మిమ్మల్ని స్త్రీ అభివృద్ధి నిరోధకులనే బిరుదిచ్చి తమ ప్రతీకారం తీర్చుకుంటారు. మన దేశానికే చెందిన ఒక మ్యాగ్‌జైన్‌లోని కార్ల వాణిజ్య ప్రకటనలో ఓ యువతి తన సౌందర్యాన్నం తటిని కుప్పపోసింది. ఏమిటమ్మా ఈ నిర్వాకం అని అడిగితే, ఆ అందాల భామ ఏమాత్రం తడుముకోకుండా 'ఈ అందం నాది, ఈ శరీరం నాది, వీటిని ఏవిధంగానైనా ప్రదర్శించుకునే, బహిరంగ పరచుకునే హక్కుంది నాకు. కాదనే అధికారం ఎవరికీ లేదు" అని సమాధానమిచ్చింది.

కొన్నాళ్ళ క్రితం ఢిల్లీ నుండి వెలువడే ఒక జాతీయ దినపత్రిక చేసిన సర్వే ప్రకారం కొందరు యువకులు తమ ఉపాధిఒనరులను బాగా పెంచగలిగే అందమైన యువతుల్ని వివాహమాడేందుకు తీవ్రంగా అన్వేషిస్తున్నారట! అంటే నర్తన వృత్తి ఇప్పుడు గౌరవప్రదమైన కుటుంబాలకు కూడా ప్రాకిందన్న మాట. అందువల్లనే ఇప్పుడు భాషా, పదాలు కూడా మారిపోతున్నాయి. వ్యభిచారిణి (prostitute)ని ఇప్పుడు లైంగిక కార్మికురాల (Sex Worker)ని అంటున్నారు. స్త్రీ గౌరవాన్ని ఆమె శారీరక అందంతో ముడిపెడ్తున్నారు. ఎక్కడో ఒకరిద్దరు స్త్రీలను మాత్రం వారి విద్యా జ్ఞానాలు, సామాజిక సేవల ప్రాతిపదికపై గౌరవిస్తున్నారు. ఆధునిక నాగరికతలో స్త్రీల గౌరవాన్ని గురించి తెలుసుకో దలచినవారు వార్తా పత్రికలు, మ్యాగ్‌జైన్‌లలో చూడ వచ్చు. ఈ పత్రికలు స్త్రీల నగ్న, అర్ధనగ్న

చిత్రాలతో నిండిపోయి ఉంటాయి. అవి లేని పత్రికలు, మెగజైనులు ప్రజలు కొనరు.

ఆధునిక నాగరికతలో స్త్రీ స్వయం నిర్ణయాధికారాన్ని వర్ణించడానికి నిర్దేశించిన కొలమానాలలో కూడా లైంగికత్వమే పనిచేస్తోంది. దీనికి ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యాన ఈ మధ్యకాలంలో నిర్వహించబడిన అనేక సదస్సుల కార్యక్రమాలే ప్రబల నిదర్శనం. ముఖ్యంగా వీటిలో రెండు సదస్సులు పేర్కొనదగినవి. ఒక సదస్సు కైరోలో జరిగింది. ఇది ఐక్యరాజ్య సమితికి అనుబంధ సంస్థ అయిన 'ప్రపంచ జనాభా నిధి' ఆధ్వర్యాన జరిగింది. ఇందులో సెక్యులర్ దృక్పథం గల పెద్దలందరూ పిల్లలను కనే హక్కు గురించే ఎక్కువగా మాట్లాడారు. స్త్రీకి తాను ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఏవిధంగా కోరుకుంటే ఆవిధంగా కామక్రీడలో పాల్గొనే హక్కుండాలని; అలాగే ఆమె ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు బిడ్డను కనే లేదా అసలు కనకుండా ఉండే హక్కు కూడా ఉండాలని ఈ పెద్దలు ఆ సదస్సులో వాదించారు. కాబట్టి ఈ స్వయం నిర్ణయాధికారాన్ని అమలుపరచడానికి గర్భస్రావం చేసుకునే అనుమతి కూడా ఆమెకుండాలని, దానికోసం స్త్రీ తన భర్త అనుమతి మీద ఆధారపడకుండా బిడ్డను కనేందుకు లేదా గర్భస్థ పిండాన్ని అంతమొందించేందుకు వీలుగా చట్టాలలో తగిన మార్పులు చేయాలని కూడా వారు తమ ప్రసంగాలలో బాహాటంగా వాదించారు.

ఐక్యరాజ్య సమితికి చెందిన కొందరు స్త్రీలు మతపరమైన ఉత్సవాలు, ప్రత్యేక ఆరాధనలు, ఆచారవ్యవహారాల సందర్భంగా కండోమ్‌ల ప్రయోజనం గురించి, గర్భ విచ్ఛేదం గురించి ప్రచారం చేయాలన్న ఒక పథకాన్ని ఈ సదస్సులో ప్రతిపాదించారు. ఇలాంటి స్వయం నిర్ణయాధికారాన్ని స్త్రీ విస్తృతారోగ్యంలో ఒక భాగంగా

పేర్కొనడం జరిగింది. ఈ సదస్సుకు వందల మీటర్ల దూరంలో 'బీజింగ్ ప్లస్ ఫాయూ కాన్ఫరెన్స్-2000' పేరుతో మరొక సదస్సు జరిగింది. అందులోని ప్రసంగాలు, కార్యక్రమాలు, సెమినార్‌లు, సింపోజియమ్‌లు, డాక్యుమెంట్‌లు అన్నీ స్త్రీ ప్రస్తుత దుస్థితి గురించి ఏకరువు పెడుతూ ఆమె స్వయం నిర్ణయాధికారం గురించే ఎక్కువగా చెప్పడమయింది. ఆ సదస్సులో బీజింగ్ డిక్లరేషన్, ప్లాట్‌ఫారం ఫర్ యాక్షన్‌లను గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ విషయంలో స్త్రీల ప్రగతి వికాసాల కోసం పన్నెండు సూత్రాల పథకం ఒకటి సమర్పించబడింది. అయితే పురుషుడు తన కామవాంఛను బలవంతగా తీర్చుకునే లైంగికహింసను గురించి ఎక్కువగా పేర్కొనడం జరిగింది. ఈ పథకంలో రెండవ ముఖ్యాంశం స్వలింగ సంపర్గంలో కూరుకుపోయిన పురుషులకు సంబంధించినది. దానికి చట్ట బద్ధత కల్పించాలని వారు డిమాండు చేశారు. ఈ లక్ష్యాలు సాధించడానికి ముఖ్యంగా రెండు సమస్యలు ఎదురయ్యాయి. ఒకటి, పన్నెండు సూత్రాల పథకం కోసం బడ్జెట్ ఎక్కడ్నుంచి తీసుకురావాలి అన్నది. రెండు, కుటుంబ వ్యవస్థను యధాతథంగా ఉంచడానికి ఏం చేయాలి అన్నది. కాని సదస్సు నిర్వాహకులపై అత్యధికంగా పాశ్చాత్య నాగరికతా ప్రభావం ఉన్నందున స్త్రీ పురుషులు ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆధారపడని శాశ్వతమైన రెండు విభిన్న జాతులుగా మారాలన్న ఆలోచనా ధోరణే వారిలో చివరిదాకా ద్యోతకమయింది.

స్త్రీ స్వాతంత్రోద్యమ ప్రభావం ఎక్కువగా పాశ్చాత్య సమాజం మీద పడింది. దీని ఫలితంగా అక్కడ 'సింగిల్ పేరెంట్ ఫ్యామిలీ' (Single Parent Family) ఒక ఆనవాయితీగా మారింది. పాశ్చాత్య నాగరికత చిత్తశుద్ధితో కూడిన నాగరికత కాదు. ఇది ప్రదర్శనాబుద్ధితో కూడిన నాగరికత. సింగిల్ పేరెంట్ అని చెప్పబడే ఈ పారిభాషికా పదాన్ని బట్టే

స్త్రీపురుషులు కామక్రీడ తరువాత వేరయిపోవడంగాని, వేరుగా ఉండటం గాని చేయవచ్చని, ఏ సమాజానికి కూడా దీనికి అడ్డంకులు సృష్టించే అధికారం లేదని తెలుస్తుంది. ఈ నిర్వాకం తరువాత పురు షుడు బిడ్డ జన్మకు కారకుడు మాత్రమే అయి దానికి సంబంధించిన బాధ్యత లన్నిటిని గాలికి వదిలేసి వెళ్ళిపోతాడు. కాని స్త్రీ తన చంటిబిడ్డను ఒడిలో పెట్టుకొని ఓ సుదీర్ఘకాలం వరకూ బాధ్యతల భారం మోయవలసి వస్తుంది. ఈ వైఖరి స్త్రీకి గౌరవనీయమైనదా లేక అవమానకరమైనదా? ఇస్లామీయ సామాజిక వ్యవస్థ ప్రకారం సృష్టి ప్రక్రియలో స్త్రీ, పురుష లిద్దరూ భాగస్వాములుగా ఉంటారు. ఇక్కడ స్త్రీ పెంపుడు బాధ్యత వహిస్తే, పురుషుడు ధనార్జనా భారాన్ని తన భుజాల మీద వేసు కుంటాడు. దీనికి భిన్నంగా ఈ ప్రత్యామ్నాయ సింగిల్ పేరెంట్ వ్యవస్థ వల్ల స్త్రీయే ఎక్కువ నష్టపోతుంది. పాశ్చాత్య నాగరికతకు ప్రభావితు రాలయిన తరువాత ఒకవేళ ఆమె లైంగికానందంలో మునిగిపోవడం జరిగితే అనాథగా మారి భయంకరమైన ఒంటరి జీవితం గడపవలసి వస్తుంది. ఆ తరువాత ఈ ఒంటరి తల్లి తన సంతానానికి సరైన శిక్షణ ఇవ్వడంగాని, వారిని కనిపెట్టుకొని ఉండటంగాని జరగదు. వీటన్నిటినీ గురించి ప్రశాంతంగా ఆలోచిస్తే పాశ్చాత్య తరహా ఆధునిక సమాజం స్త్రీని సెక్స్ సింబల్‌గా, శారీరక సౌఖ్యసాధనంగా పరిగణించిందని తెలుస్తుంది.

ఇలా స్త్రీ సెక్స్ సింబల్‌గా, శారీరక సౌఖ్యసాధనంగా చేయబడటం వల్ల దాని దుష్ప్రభావం మన దేశంపై కూడా నానాటికి పెరిగిపోతోంది. ఈ దుష్ప్రభావం సంగీతం, సాహిత్యం, కళలకు సంబంధించిన మ్యాగ్ జైన్‌ల స్థాయి నుండి జాతీయ దినపత్రికల స్థాయికి ఎదిగిపోయింది. అగ్నికి ఆజ్యం పోసినట్లు ఇప్పుడీ రంగంలో టెలివిజన్లు అపార హానికర పాత్ర నిర్వహిస్తూ సమాజాన్ని సమస్యల సుడిగుండలో పడవేస్తున్నాయి.

చుట్టరికం, బంధుత్వాల పరిశుద్ధ జీవితాలకు లైంగికార్షణ తూట్లు వేస్తోంది. ఢిల్లీ అధికారులు ఇటీవల జరిపిన ఒక సర్వేలో స్త్రీలపై జరుగుతున్న అత్యాచార సంఘటనల్లో 75 శాతం దగ్గరి బంధువుల ప్రమేయం ఉన్నట్లు వెల్లడి చేశారు. ఇటీవల కాలంలో అభం శుభం ఎరగని అమాయక చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలను గురించి వింటే మీరు మీ పసిపాపలను తండ్రుల, బాబాయిల రక్షణలో ఒంటరిగా వదిలి పెట్టడం మంచిది కాదన్న అభిప్రాయానికి వస్తారు. కనిపెంచిన తండ్రులే తమ కుమార్తెల ద్వారా సంవత్సరాల తరబడి కామదాహం తీర్చుకున్న భయంకర సంఘటనలు కూడా జరిగాయి. పాఠశాలల వాతావరణం కూడా చెడిపోయింది. పాఠాలు చెప్పే గురువులే తమ శిష్యురాళ్ళపై అత్యాచారానికి పాల్పడిన్ల నివేదికలు వస్తున్నాయి. డాక్టర్లు తమ పేషంట్లపై అత్యాచారం చేయడానికి వెనకాడటం లేదు. ఈ చేదు ఫలాలు ఏ చెట్టు నుంచి రాలిపడుతున్నాయి? స్త్రీని సెక్స్ సింబల్‌గా, భోగ సాధనంగా మార్చిన పాశ్చాత్య నాగరికతా విషవృక్షం నుంచే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ విషవృక్షం ఆర్థిక వ్యవహారాల నుండి రాజకీయాల వరకు స్త్రీని అత్యంత శక్తిమంతమైన సూదంటురాయిలా రూపొందించి వదలిపెట్టింది. మీరేదైనా పని కోసం రాజకీయ నాయకుల దగ్గరకు పోవలసివస్తే స్త్రీని ఉపయోగిస్తే చాలు మీ పని సులభంగా నెరవేరుతుంది.

ఇప్పుడు పోలీసులు, మిలటరీ జవాన్లు కూడా దుండగుల్ని, పీడితుల్ని శిక్షించ డానికి స్త్రీలపై అత్యాచారమే అత్యంత ప్రభావవంతమైన పనిముట్టని భావిస్తున్నారు. వారు మీరట్, ముజఫ్ఫర్ నగర్‌లలో ఉత్తర్ అఖండ్ గురించి డిమాండ్ చేసినవారి పట్ల ఇలాగే ప్రవర్తించారు. ప్రదర్శనకారులకు 'బుద్ధి' చెప్పడానికి వారి స్త్రీలపై పోలీసులు ఘోరంగా

అత్యాచారం జరిపారు. దానికి పూర్వం సూరత్‌లో ముస్లిం యువతుల్ని నగ్నం చేసి వీధుల్లో తిప్పారు. వారిపై అత్యాచారం జరిపి వీడియో తీశారు. కాశ్మీర్‌లో దేశ సరిహద్దుల్ని కాపాడే మన వీర జవాన్లు ఈ పనుల్లో ఇప్పటికీ మునిగి తేలుతున్నారు. ఈ వ్యాధి విషక్రిములు మన దేశంలోనే కాదు, యూరప్, అమెరికా మొదలైన దేశాలన్నిటికీ ప్రాకి పోయాయి. బోస్నియా ముస్లిం మహిళలపై పెద్ద ఎత్తున సామూహిక అత్యాచారాలు జరిగాయి. ఇరాఖ్, అఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా సైనికులు కూడా ఈ నిర్వాకానికి పాల్పడ్డారు, ఇప్పుడూ పాల్పడుతున్నారు. శత్రువుల్ని శిక్షించడానికి వారి స్త్రీల మానం దోచుకోవడమే పాశ్చాత్య నాగరికత స్త్రీ జాతికి వారు ఇస్తున్న గౌరవమర్యాదలు ఇవే!

స్త్రీలపై సామూహిక అత్యాచార సంఘటనలు ఇప్పుడు యూనివర్సిటీ క్యాంపస్ లోకి కూడా ప్రవేశించాయి. ఉదాహరణకు రాజస్థాన్ యూనివర్సిటీ హాస్టల్‌లో జరిగిన సామూహిక అత్యాచారం (Gang Rape) సంఘటనే తీసుకోండి. ఒక కాలేజీ విద్యార్థి పోలీసు శాఖలో ఎంపికయిన సందర్భంగా ఒక 'మందు పార్టీ' జరిగింది. ఈ మందు పార్టీలో మద్యపానం, నీలిచిత్రం (Blue Film) ప్రదర్శన కూడా జరిగింది. ఆ తర్వాత సామూహిక అత్యాచార సంఘటన జరిగింది. అప్పుడు అక్కడున్న విద్యార్థులు సామూహిక అత్యాచారం జరుగుతున్నంత సేపు చప్పట్లు కొడుతుండేవారు.

స్త్రీలకు లభిస్తున్న గౌరవప్రపత్తులకు మరొక ఉదాహరణగా మన దేశంలో ఆడ శిశుహత్యలు (Female Foeticide) కూడా జరుగుతున్నాయి. మన సమాజంలో భవిష్యత్ ప్రమాదం భయంతో తల్లులు తమ పసిపాపలను చంపుతున్నారు. ప్రారంభంలో ఈ తల్లులు తమ పసి పాపలను పుట్టిన తరువాత వివిధ పద్ధతులతో గుట్టుగా మట్టు

పెడుతుండేవారు. ఇప్పుడా పద్ధతులు అవలంబించవలసిన అవసరం లేదు. వైద్యమహాశయుల సహకారంతో గర్భ స్కానింగ్ చేయించుకొని అందులో పుట్ట బోయే శిశువు ఆడపిల్ల అని తెలిస్తే ఆ పిండాన్ని మాతృ గర్భంలోనే మటుమాయం చేస్తున్నారు. మొదట్లో ఈ 'పీడ'ను పేదలు మాత్రమే వదిలించుకునేవారు. తరువాత ఈ నిర్వాకంలో పేదలు, ధనికులు అన్న తేడా లేకుండా అందరూ చేరిపోయారు. ఈ అంటు వ్యాధికి ఇప్పుడు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు కూడా గురయిపోయాయి. ఈ భ్రూణ హత్యలకు ప్రధాన కారణం- ఆడ పిల్లలు భవిష్యత్తులో కుటుంబానికి గుదిబండలుగా తయారవుతారన్న భయమే. ఆడ పిల్లలు సంపాదనా పరులుగా మారక పోవడమే గాకుండా, ఆస్తుల పంపకంలో వాటా దారులై కుటుంబానికి దారిద్ర్యం తెచ్చిపెడ్తారన్న భయంతో తల్లిదండ్రులు ఆ దుస్థితి రాకుండా 'ముందు జాగ్రత్తలు' తీసుకుంటున్నారు. మన దేశంలో ముస్లిమేతర కుటుంబాలలో ఒక ఆచారం ఉంది. దాని ప్రకారం మనిషి మరణించిన తరువాత శవానికి తలకొరివి మగ పిల్లలు మాత్రమే పెట్టాలి, ఆడపిల్లల అవసరం లేదు. మరో వైపు కట్నకానుకల రివాజు కూడా తల్లిదండ్రులకు తలనొప్పి భారమైపోయింది.

పాశ్చాత్యనాగరికత స్త్రీకి ఎన్నో రాయితీల ఆశ చూపింది. ఈ విషయమై కొన్ని రంగాల్లో విజయం కూడా సాధించింది. అయితే విధులు-బాధ్యతల్ని నిర్దేశించడంలో, వాటిని అమలుపరచడంలో అనేక ఎదురుదెబ్బలు తిన్నది. పాశ్చాత్యనాగరికత స్త్రీ హక్కులకు సంబంధించి కళ్ళు మిరుమిట్లు గొల్పే పథకం రూపొందించింది. ఈ పథక రచనలో బాధ్యతలన్నీ పూచిక పుల్లల్లా కొట్టుకుపోయాయి. అలాగే అది నవ

సమాజ రూపకల్పనలో కుటుంబ వ్యవస్థను పటిష్ఠపరచి ప్రగతి పథంలో నడిపించే మౌలిక విషయాలను మరచిపోయింది. కుటుంబ వ్యవస్థ నిర్వహణలో భార్యాభర్తలే ప్రధాన పాత్రధారులు. వారిరువురి మధ్య పరస్పరం చిత్తశుద్ధితో కూడిన ప్రేమాను రాగాలు, దయాసానుభూతులు ఉన్నప్పుడే కుటుంబం సక్రమంగా సాగుతూ ప్రగతి పథంలో పురోగ మిస్తుంది. వాటి కోసం విధులు, బాధ్యతలు కలసిమెలసి ఉండాలి. స్త్రీ పురుషులు తమతమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ సంఘటితంగా పని చేసినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఉనికిలోకి వస్తుంది. ఈ విధానం పేరే సమతూకం. సమతూకం ద్వారానే న్యాయం వికసిస్తుంది. ఇస్లాం ఇలాంటి న్యాయమైన వ్యవస్థకే పటిష్ఠమైన పునా దులు వేసింది. మానవుడు దైవబోధనలు విస్మరించి సొంత నిర్ణయాలతో న్యాయరహిత వ్యవస్థ స్థాపనకు ప్రయత్నించినప్పుడల్లా అతనికి అపజయమే ఎదురవుతూ వచ్చింది.

విధులు-బాధ్యతల్లోని సమతూలనారాహిత్యం, గందరగోళాల కారణంగానే పాశ్చాత్య నాగరికత, ఇతర ఇస్లామేతర నాగరికతలన్నీ ఎదురు దెబ్బలు తిన్నాయి. ఉదాహరణకు- మొదట విడాకుల్ని దుర్భర మైన చెడ్డ వ్యవహారంగా భావించబడింది. యూరప్ దేశాల్లో విడాకులకు అవకాశమే ఉండేది కాదు. మన దేశంలో స్త్రీ భర్త చనిపోయిన తరువాత అతని చితిలో పడి కాలిపోయే సతీసహగమన ఆచారం ఉండేది. ఇప్పుడు పాశ్చాత్య నాగరికత పుణ్యమా అంటూ విడాకులకు తలుపులు తెరవబడ్డాయి. అయితే విడాకుల విధానం శృతిమించిపోయి పెద్ద తమాషాగా మారిపోయింది. మన దేశంలో ఇంకా అలాంటి పరిస్థితి రాకపోయినా భవిష్యత్తులో వచ్చే ప్రమాద సూచికలు కన్పిస్తున్నాయి.

దైవాజ్ఞలతో ప్రమేయంలేని ఆధునిక నాగరికత మన సమాజాన్ని ఎలాంటి చీకటి కుహరాల్లోకి నెట్టివేసిందో యోచించడానికి మచ్చుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రశాంత మనస్సుతో ఆలోచించే వారికి ఇవి చాలు.

(సమాప్తం)